సాహిత్య సేవకు..
శతకోటి వందనాలు



'ఉత్తరావల్లి ఊసులు' పుస్తకావిష్కరణ సభ (ఫైల్)

- నేడు 'తెరవే' సంస్థ 100వ నెలవారీ కార్యక్రమం
- పదిహేనేళ్లుగా సాహిత్యం, తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్న సభ్యులు
- 100 మంది కవులు, రచయితలతో నెలవారీ కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాష పరిరక్షణ, తెలుగు సాహిత్య వికాసమే ధ్యేయంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటైన తెలుగు రచయితల వేదిక(తెరవే) తన ప్రస్థానంలో మరో మైలురాయికి చేరుకోనుంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా మొదటి ఆదివారం కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమం ఏర్పాటై ఇప్పటికి వంద నెలలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5న ప్రత్యేక సాహితీ సభ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. పలువురు కవులు రాసిన కవితలతో సంకలనాన్ని ఆవిష్కరించనున్నారు.

కళాశాల వేదికగా..

తెలుగు భాషా పరిరక్షణ, తెలుగు సాహిత్య వికాసం ధ్యేయంగా 2010 మార్చి 7న అప్పటి ఎస్పీ ఎ.ఎస్.గురప్ప ప్రోత్సాహంతో కోనె శ్రీధర్ అధ్యక్షతన తెరవే సంస్థను ఏర్పాటు చేశారు. వీరితో పాటు బగాది శ్రీరామూర్తి, ఎం.వి.మల్లేశ్వరరావులతో ప్రారంభమైన ఈ కార్యవర్గం తర్వాత బొమ్మకంటి సత్యనారాయణ, మంతెన వాసుదేవాచారి, పొట్నూరు వెంకటరావు, గౌరవ అధ్యక్షులుగా బరాటం కామేశ్వరరావులు సేవలందించారు. ప్రస్తుతం అధ్యక్ష కార్యదర్శులుగా ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి. రమణమూర్తిలు శాంతినికేతన్ జూనియర్ కళాశాల వేదికగా సేవలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇందులో వందమంది సభ్యులు పాల్గొని తమ కవితా రచనలను చేస్తున్నారు.


ఆవిష్కరణకు సిద్ధమైన 'హంసవాహిని' పుస్తకం

సాహిత్య కార్యక్రమాలు..

2016 అక్టోబరు 12న సాహితీ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి నెలా మొదటి ఆదివారం కవి సమ్మేళనంతో పాటు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, గిడుగు జయంతి రోజున తెలుగు భాషా దినోత్సవం, గురజాడ, గరిమెళ్ల వంటి సాహితీవేత్తల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉగాది సందర్భంగా జిల్లా స్థాయిలో కవి సమ్మేళనాన్ని నిర్వహించి సాహితీవేత్తలను, వివిధ రంగాల ప్రముఖులను సత్కరించడం, పంచాంగ శ్రవణ కార్యక్రమం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. కిమ్మి సంతోష్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.

పుస్తకావిష్కరణలు..

తెరవే ఆధ్వర్యంలో 22 మంది కవుల రచించిన సంకలనంతో 'నాగావళి తరంగాలు' పేరిట తొలి పుస్తకం తీసుకువచ్చారు. 26 మంది కవుల రచనలతో 'కవితా వసంతం' పుస్తకాన్ని, గాంధీ మందిరం సహకారంతో 'గాంధేయం' పుస్తకాన్ని, 2023లో ఉగాదికి 'సాహితీ కిరణాలు' పుస్తకాన్ని విడుదల చేశారు. ఇప్పటికి వంద నెలలు పూర్తయిన సందర్భంగా 39 మంది తెరవే సభ్యుల రచనలతో 'హంసవాహిని' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.

భాషకు సేవ చేయడమే..



తెలుగు భాష సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. కొత్త కొత్త రచనలను, రచయితలను కూడా పరిచయం చేస్తున్నాం. వారి ద్వారా మరింత కొత్తదనంతో సాహిత్యం వస్తోంది.
– ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, అధ్యక్షుడు, తెరవే

దాతల సహకారంతో..



మా సంస్థ నిత్యం కొనసాగడంలో ఎంతో మంది దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఉంది. ముందుందు కూడా మరిన్ని సాహితీ పరమైన కార్యక్రమాలు చేపడతాం.
– రఘుపాత్రుని వెంకటరమణ మూర్తి, ప్రధాన కార్యదర్శి, తెరవే

బయాలజీ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ


గార: జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన సతివాడ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గార: మండల స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌లో సతివాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం గార జెడ్పీ హైస్కూల్లో జరిగిన పరీక్షలో పి.కోమలరావు, జి.దుర్గాప్రసాద్, జి.పరిమళలు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ముద్దాడ గౌరీశంకర్ తెలిపారు. డిసెంబర్ 29న జరిగిన ఈఈఎంటీ ప్రతిభా పరీక్షలో 10వ తరగతి నుంచి ఐదుగురు, 7వ తరగతి నుంచి ఒకరు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జి.సిగడాం: జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బయాలజీ ప్రతిభా పరీక్షలో డి.బొండపల్లి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని హెచ్‌ఎం నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు మాడుగుల భారతి, రాజ్యలక్ష్మి, సాయిరాం, చిన్నారావు, గణపతిరావు, ఆనందరాజు, ఎస్.భారతి, సురేష్ అభినందించారు.


జి.సిగడాం: విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బయాలజీ టాలెంట్ టెస్టులో ఏపీ మోడల్ స్కూల్, బెజ్జిపురం, మురపాక పాఠశాలల విద్యార్థులు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఏపీటీఎస్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుట్టా ఉదయ్‌కుమార్, ఎస్‌వీ రమణ, చౌదరి శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, రూబెన్‌కుమార్, బొత్స వెంకటరమణ, ఆనందరామారావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన బయోలజీ టాలెంట్ టెస్టులో కేశవరావుపేటకు చెందిన మనోజ్, కావ్య, కమల్ విజేతలుగా నిలిచారు. వీరికి విద్యాశాఖ అధికారి పున్నయ్య, హెచ్‌ఎం శ్రీరాములు, బీఎస్‌టీఎఫ్ కన్వీనర్ బాబూరావు బహుమతులు అందజేశారు.


ఎచ్చెర్ల: బుడుమూరులో విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న ఉపాధ్యాయులు


ఎచ్చెర్ల క్యాంపస్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఇంగ్లిష్ మీడియం రద్దు సహించం


రౌతు శంకరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2020 –21 సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలవుతుండటంతో ఎంతోమంది పేద పిల్లలు లబ్ధి పొందారని చెప్పారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం రద్దు చేస్తూ జీఓ 85 విడుదల చేయడం దురదృష్టకరమన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం కొనసాగిస్తూ.. కేవలం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం అనడం భావ్యమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు పేదల అభివృద్ధికి కృషి చేయాలే తప్ప పెత్తందారులకోసం కాదన్నారు. సీఎం చంద్రబాబు విద్యను ప్రైవేటుపరం చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చదువును దూరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

తూర్పుకాపుల స్థల జీఓ పునరుద్ధరించాలి


మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూర్పుకాపులకు గత ప్రభుత్వ హయాంలో 50 సెంట్ల స్థలం కేటాయిస్తూ జీవో ఇచ్చారని, ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో అర్థంతరంగా అమలుకు నోచుకోలేదని తూర్పుకాపు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జీవోను పునరుద్ధరణ చేయాలని కోరుతూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వినికి శనివారం విజయనగరంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తూర్పుకాపు జాతీయ నాయకుడు పిసిని చంద్రమోహన్, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, సీనియర్ అడ్వకేట్ వాన కృష్ణచంద్, కద్దాల శ్యామసుందర్, కొండాల గణేష్, కరణం శ్రీనివాసరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లీజు బకాయిలు చెల్లించని షాపులు సీజ్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దీర్ఘకాలంగా అధిక మొత్తంలో పన్నులు, లీజు బకాయి ఉంటే సీజ్ చేయక తప్పదని ఆర్‌ఐ నరేష్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ కాంప్లెక్స్‌లో బకాయిపడ్డ లీజుదారులు ఎస్.లక్ష్మణ్‌రావు, ఎస్.రామరాజ్యం షాపులను శనివారం సీజ్ చేసినట్లు చెప్పారు.

ఏబీవీపీ శ్రీకాకుళం మండల కమిటీ ఎన్నిక


మండల కమిటీతో సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మండల కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ బోర గోపి తెలిపారు. మండల కన్వీనర్‌గా గుజ్జల జయప్రకాష్, కార్యదర్శి ఎచ్చెర్ల కళ్యాణ్ చక్రవర్తిలను నియమించారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ సింహాచలం, మధు, సభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సేవలు భేష్


బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులలో మంచి ప్రతిభావంతులు ఉన్నారని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం డీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి అనూరాధ, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కవిత, డీఐపీఆర్‌ఓ కె.చెన్నకేశవరావు, సెట్విస్ సీఈఓ ప్రసాదరావు, అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో ఒకటో డిపోకు చెందిన రెండు కొత్త అల్ట్రా డీలక్స్ (శ్రీకాకుళం–విశాఖ మార్గంలో) బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డిపోల మేనేజర్లు హనుమంతు అమర సింహుడు, కె.ఆర్.యస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్‌ఎం ఎంపీ రావు, టీఐ–3 ఎల్‌ఎస్ నాయుడు, కె.సుమన్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడిగా డోల


వెంకటరమణను అభినందిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడిగా చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన డోల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణను పార్టీ మండల నాయకులు మీసాల వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, ఏర్నేన ప్రకాశరావు, చిత్తిరి మోహన్, చందక సతీష్, పిల్లల శివకుమార్, బూటు అప్పారావు, నల్లి తవిటినాయుడు, మీసాల రాంబాబు, ఈ.గోవిందరావు, కుమరాపు శ్రీనివాసరావు, కీర్తి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి పాశుర పఠనం



ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి పాశురాన్ని పఠించారు. గోదాదేవి శ్రీకృష్ణునిపై భక్తి చాటుతూ తెలియజేసే 20వ పాశురాన్ని మహిళలు సామూహికంగా చదివారు. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి మహాహారతి ఇచ్చారు.
– శ్రీకాకుళం కల్చరల్

వెంకన్నకు విశేష అలంకరణ



నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాల పూజలు అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.
– శ్రీకాకుళం కల్చరల్

విజేతకు అభినందనలు



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్న పి.పవిత్ర ప్రతిభ కనబర్చింది. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతగా నిలిచి బహుమతులు అందుకుంది. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, కామర్స్ హెచ్‌ఓడి లబ్బ కృష్ణారావు, కామర్స్ లెక్చరర్లు అభినందించారు.
– శ్రీకాకుళం న్యూకాలనీ

కొత్త రేషన్‌కార్డుల మంజూరెప్పుడు?

- రణస్థలం మండల సమావేశంలో సభ్యుల ప్రశ్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పిన్నింటి రజని

రణస్థలం: గతంలో చేసిన నాడు–నేడు పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని పలువురు సభ్యులు కోరారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ ఆధ్వర్యంలో శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పిన్నింటి రజని మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో రణస్థలం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ విలువ రూ.133,58,40,500గా మండల పరిషత్ సభ్యుల మధ్య ప్రవేశ పెట్టి ఆమోదించారు. తహసీల్దార్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌పీఎంలో మార్పులు, భూముల రికార్డుల్లో చేర్పులు, మార్పులకు గతంలో రూ. 550 రుసుం కట్టించుకునే వారని, ప్రస్తుతం ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. సూరాపురం గ్రామాన్ని మోడల్‌గా తీసుకుని రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు రీసర్వే చేపడతామన్నారు. ఐసీడీఎస్ పీవో ఝాన్సీ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించాలని, ఒక్క రణస్థలం మండలంలోనే 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలై 12 మంది గర్భిణులయ్యారని చెప్పారు. ఎచ్చెర్ల మండల మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్, టైలరింగ్‌లో ఉచిత కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఏవో ధనుంజయరావు, సర్పంచ్‌లు, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచడమే లక్ష్యం


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బాలురు కళాశాలలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజనం చేస్తున్న ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు మెరుగైన ఉత్తీర్ణత సాధించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమల్లో భాగంగా శ్రీకాకుళం బాలురు, శ్రీకాకుళం బాలికలు, కోకావారి గార ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు, గణపతి వెంకటేశ్వరరావు, ఎగ్జామినేషన్స్ ఏసీ లియాఖత్ ఆలీఖాన్, మదారపు వెంకటేష్, ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి, అన్నపూర్ణారావు, తదితరులు పాల్గొన్నారు. కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జీరు అయ్యప్పరెడ్డి, ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు, ఏజీఎంసీ సనపల షణ్ముఖరావు, ఎంపీటీసీ మజ్జి జగదీష్, ఎండీఎం ఏజేన్సీ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రణస్థలం: కొండములగాంలోని రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జి.సిగడాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ గుంటముక్కల కృష్ణారావు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పర్లా అపర్ణ, నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, కోనా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎచ్చెర్ల మండల పరిషత్ పరిపాలనాధికారి పీవీఎస్ రామ్మోహన్, ఎంఈఓ కె.పున్నయ్య, ప్రిన్సిపాల్ పీవీఎల్ నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఎల్‌ఎస్‌ఎస్ శ్రీధర్‌రాజా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అధికారులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాని ప్రహరీ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సీఈఓ తెలిపారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన కప్పగంతుల సూర్యనారాయణ మూర్తి, రాచకొండ వెంకటలక్ష్మి సంయుక్తంగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళాన్ని అందజేసి రశీదు పొందారు. అంతకుముందు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ దాతలకు రథసప్తమి పర్వదినాన ప్రత్యేక దర్శనం కలిపిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు మాధవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తే చర్యలు


వాహనదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

శ్రీకాకుళం: నగరంలోని ముత్యాలమ్మ మార్కెట్ వద్ద ఉదయం పూట ఆటోలతో కూరగాయలు తీసుకొచ్చి రోడ్డుపైనే వాహనాలు నిలిపి వ్యాపారం చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ముత్యాలమ్మ మార్కెట్‌కు మున్సిపల్ అధికారులు చేరుకుని మార్కెట్ బయట రోడ్డుపై ఉన్న ఆటోలను ఖాళీ చేయించారు. వాహదారులకు ఇబ్బంది కలగకుండా మార్కెట్ లోపల మాత్రమే వ్యాపారం చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) క్యాలెండర్‌ను శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కళాశాలల ప్రగతికి కృషి చేయాలని సంఘం సభ్యులకు సూచించారు. అనంతరం సభ్యులు తమ సమస్యలపై వీసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీసీటీఏ రాష్ట్ర అకడమిక్ కార్యదర్శి డి.పైడితల్లి, జోన్ అధ్యక్షుడు ఎస్.ఢిల్లీశ్వరరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తి, జ్ఞాన, వైరాగ్యాల సమ్మేళనం భాగవతం


నరసింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భక్తి, జ్ఞాన, వైరాగ్యాల సమ్మేళనం భాగవతమని నిష్టల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిష్మందిరంలో 'భాగవతము తెలిసి పలుకుట చిత్రం' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భాగవతం ద్వారా భగవత్ తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, కోమలరావు, పసుమర్తి మనోహర్, చాగంటి బాపయ్యపంతులు, విశ్వేశ్వరరావు, కామేశ్వరరావు, సనపల నారాయణమూర్తి, సరస్వతి, శ్యామల, మణి, పుష్ప పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత విభావరి


శాస్త్రీయ సంగీత ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల 303వ నెలవారి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాజరాజేశ్వరీ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో శనివారం శాస్త్రీయ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. పీఠం నిర్వాహకులు సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ ఆధ్వర్యంలో శిష్యబృందం ప్రదర్శన చేశారు. సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేద కళకారులకు పింఛన్లు అందజేశారు. ప్రముఖ కళాకారులు ఎల్.నందికేశ్వరరావు, ఎల్.రామలింగస్వామిలకు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ సెట్‌శ్రీ సీఈవో వి.వి.ఆర్.ఎస్.మూర్తి, డాక్టర్ మందుల మోహనరావు, కార్యదర్శి బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, ఇంజరాపు రమణారావు, బి.ఎ. మోహనరావు, పొట్నూరు వేంకటరావు, పైడి సత్యవతి, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.